క్లుప్తంగా

తిమ్మరాజుపేట రామాలయంలో ప్రత్యేక పూజలు



ఉత్సవ విగ్రహాలను తరలిస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో రామాలయం ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 8న సీతారాముల విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో గోపూజ, అఖండ దీపారాధన, గణపతి పూజతోపాటు హోమాలు నిర్వహించారు. వేద పండితులు కోటేశ్వర శర్మ మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

15లోగా ఈ-పంట నమోదు



ఈ-పంట నమోదు వివరాలు పరిశీలిస్తున్న సహాయ సంచాలకుడు రామారావు

మునగపాక: ఈ నెల 15లోగా ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలని అనకాపల్లి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఎం.రామారావు కోరారు. గురువారం మునగపాక, వాడ్రాపల్లి, గంటవానిపాలెం తదితర గ్రామాల్లో ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం ద్వారా సేవలు అందుతాయన్నారు. రబీలో పంటల సాగు చేసే రైతులు తప్పనిసరిగా నమోదుపై దృష్టి సారించాలన్నారు.వీఏఏ సింధూజ ఆయన వెంట పాల్గొన్నారు.

పశు బీమా నగదు అందజేత



నాగేశ్వరరావుకు పశు బీమా సొమ్ము అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: మండలంలోని ఎం.జగన్నాథపురంలో పాడి రైతు గొర్లె నాగేశ్వరరావుకు పశు బీమాలో భాగంగా రూ.50 వేలను విశాఖ డెయిరీ ప్రతినిధులు గురువారం అందజేశారు. ఇటీవల నాగేశ్వరరావుకు చెందిన పాడి పశువు మృతి చెందడంతో పశు బీమా కింద పాల సొసైటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో పాల సొసైటీ అధ్యక్షుడు సేనాపతి వంశీ, పీలా కాశీబాబు, భీమిని నాయుడు, బుదిరెడ్డి చిరంజీవి, వజ్రపు సూరిబాబు, పీఎస్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

తమలపాకు పంటపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పాయకరావుపేట: తమలపాకు పంటపై రైతులకు అవగాహన ఎంతో అవసరమని కేవీకే సీనియర్ శాస్త్రవేత్తలు కె.శైలజ, ఎం.శివ తెలిపారు. మండలంలోని సత్యవరం గ్రామంలో తమలపాకు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యలమంచిలి కృషి విజ్ఞాన కేంద్రం, తాండవ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రైతులకు పంటలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. తోట నాటు విధానం, భూసార పరీక్ష, తడి సారం, పెరుగుదలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సకిలేటి రాము, తాండవ రైతు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు జి.వి.వి. సత్యనారాయణ, సంఘం అధ్యక్షుడు విశ్వనాథుని సత్యనారాయణ పాల్గొన్నారు.

కంబాల జోగులు పరామర్శ



సుబ్రహ్మణ్యం, సత్తిబాబులను పరామర్శిస్తున్న కంబాల, చిక్కాల

పాయకరావుపేట: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు, మండలాధ్యక్షుడు చిక్కాల రామారావు పరామర్శించారు. శ్రీకామాక్షి వడ్రంగి పనివారాల గౌరవాధ్యక్షుడు కొత్తల నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుమారులు సుబ్రహ్మణ్యం, సత్తిబాబులను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, నాయకులు కేశనకుర్తి సత్తిబాబు, దోమాడ సుందరరావు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం



పెదఉప్పలం పాఠశాల వద్ద పేరుకుపోయిన మురుగు, అదే గ్రామంలో కాలువల దుస్థితి

- అపరిశుభ్రంగా వీధి కాలువలు
- దోమలకు ఆవాసంగా డ్రైనేజీలు
- చెత్తా చెదారాలు, మురుగుతో అవస్థలు
- అన్ని గ్రామాల్లోనూ ఇదే దుస్థితి

ఎస్.రాయవరం: గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడికక్కడ వీధి కాలువలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఎప్పటికప్పుడు డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడం వల్ల మురుగు పేరుకుపోయి దోమలకు, ఈగలకు ఆవాసంగా మారుతోంది. వీటి బెడద రాత్రిళ్లు కంటి మీద కునుకు ఉండటం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. వీధులతోపాటు ఖాళీ ప్రదేశాల్లో చెత్తా చెదారాలు, మురుగు నుంచి వెలువడుతున్న దుర్గంధం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధానంగా మండలంలో తిమ్మాపురం, పెదగుమ్ములూరు గ్రామాల మధ్య వాణిజ్య సముదాయాల వద్ద వ్యర్థాలు ఎక్కడికక్కడే పడేయడం వల్ల రోడ్డు పక్క ప్రదేశాలు డంప్‌యార్డులుగా మారుతున్నాయి. ఈ ప్రదేశంలో దోమలు బెడద విపరీతంగా పెరిగిపోయాయి. డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురుగుతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. వీటితోపాటు రోడ్లకు ఆనుకుని శిథిలమైన నివాసాలు, ఖాళీ ప్రదేశాల్లో వయ్యారిభామ మొక్కలు గుబురుగా పెరగడంతో విషపురుగులు బెడదతో భయాందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యలపై పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎప్పటికప్పుడు పరిష్కరించడంలేదని స్థానికులు వాపోతున్నారు.

పారిశుధ్యంపై దృష్టిపెట్టని పాలకులు

కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీలకు నిధులు విడుదల చేశామని చెప్పడం తప్ప డ్రైనేజీల నిర్మాణానికి పారిశుధ్య పనులు చేపట్టేందుకు వాటిని కేటాయించలేదు. పంచాయతీల్లో సర్పంచ్‌లు ఉన్నప్పటికీ వార్డు మెంబరు అర్హత లేని వ్యక్తులు నేరుగా రోడ్ల నిర్మాణానికి నిధులు ఖర్చు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రోడ్డుపై రోడ్డు వేయడం, తమకు అనుకూలమైన ప్రాంతాల్లో అత్యవసరంగా రోడ్లు వేయడంలో చూపిస్తున్న పారిశుధ్యంపైనే చూపించడం లేదు. దీంతో పారిశుధ్య సమస్య గ్రామాల్లో రాజ్యమేలుతోంది. ఇకనైనా మండల అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కూటమి నేతల వల్ల సమస్య



గతంలో గ్రామంలో పారిశుధ్య సమస్య వస్తే, ముందుగా సొంత నిధులతో పనులు చేసేవారం. ఆ తర్వాత పంచాయతీ కార్యదర్శి బిల్లు పెట్టేవారు. ఇంతవరకూ ఎటువంటి సమస్య రాకండా చూశాను. కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీ అభివృద్ధి పనులు నా ప్రమేయం లేకుండా అధికార పార్టీ నేతలు చేసుకుంటున్నారు. కనీసం సర్పంచ్‌గా నాకు సమాచారం ఇవ్వడం లేదు. సర్పంచ్ తీర్మానంతో చేస్తే సమస్య ఉన్న చోట ముందుగా పంచాయతీ నిధులు కేటాయింపులు చేస్తాం.

–కొప్పిశెట్టి సత్యం, సర్పంచ్, వెంకటాపురం, ఎస్. రాయవరం మండలం



పెదగుమ్ములూరులో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు



పారిశుధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహిస్తున్నాం. వారంలో పలుమార్లు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి గుర్తించిన చోట పనులు చేస్తున్నాం. దోమల నివారణకు చర్యలు తీసుకునేలా ఆదేశిస్తున్నాం. వీధుల్లో పిచ్చిమొక్కలు, వయ్యారి భామ మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. అధికారులు దృష్టి సారించి సర్పంచ్ ప్రమేయంతో పనులు చేయాలి.

–బి.సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీవో, ఎస్. రాయవరం



కొరుప్రోలు బీసీ కాలనీలో వయ్యారిభామ మొక్కలు



రేవుపోలవరం కదలని మురుగు

రేవుపోలవరం పాఠశాలలో సమస్యలపై నిలదీత



పాఠశాల కమిటీ సభ్యులకు సమాధానం చెబుతున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

ఎస్.రాయవరం: ఉపాధ్యాయులు, స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు సమన్వయం లోపం వల్ల రేవుపోలవరం ఉన్నత పాఠశాల అభివృద్ధి కుంటుపడుతుందని హెచ్‌ఎంను పలువురు నిలదీశారు. పాఠశాలలో కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఇక్కడ తలెత్తుతున్న సమస్యలపై చైర్మన్ అర్జిలి యర్రయ్య సుమారు 16 అంశాలను రాతపూర్వకంగా తీసుకువచ్చి హెచ్‌ఎం శ్రీనివాసరావును ప్రశ్నించారు. బోధనలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చేయడంతో 50 మందికిపైగా విద్యార్థులు పొరుగు పాఠశాలలకు వెళ్లిపోయారని, స్టడీ అవర్స్‌లో కేటాయించిన సబ్జెక్టు టీచర్ ఉండటం లేదని, పాఠశాల సమయంలో విద్యార్థులు బయట తిరుగుతున్నారని, తుఫాన్ షెల్టర్‌లో చాలీచాలని భవనంలో తరగతులు ఎందుకు నిర్వహిస్తున్నారని, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు గుడ్లు, సరుకులు పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. నాడు – నేడు భవన నిర్మాణ పనులు వెంటనే మొదలు పెట్టాలని కోరారు. వీటిపై హెచ్‌ఎం స్పందించి కొన్ని సమస్యలపై రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నాయని, ఇకపై ప్రతి సమస్య కమిటీ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరిస్తానని చెప్పారు.

అధిక లోడుతో నడిచే వాహనాలపై కేసులు

పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా అధిక లోడుతో నడుస్తున్న లారీలపై కేసులు నమోదు చేస్తామని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ హెచ్చరించారు. ఇటీవల 9 వాహనాలను గుర్తించి రూ.3.18 లక్షల మేర అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. గురువారం ఆయన మునగపాక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూడిమడక రోడ్డులో భారీ వాహనాలు అధిక లోడుతో రాకపోకలు సాగించడం ద్వారా ఇబ్బందులు పడుతున్నామంటూ అందిన ఫిర్యాదుల మేరకు దాడులు చేసి అపరాధ రుసుం వసూలు చేస్తున్నామన్నారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న 187 మందిని గుర్తించి రూ.45 వేల మేర జరిమానా విధించామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 40 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. కోడి పందేలు, పేకాట, లాటరీ, బళ్లాట వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే, సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మాకవరపాలెం: మండలంలోని పి.పి.అగ్రహారానికి చెందిన పి.రమణ(45) గురువారం బి.ఎస్.పేట వద్ద బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనం అందుబాటులో లేక ప్రైవేటు వాహనంలో నర్సీపట్నం తరలించారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం గర్హనీయం

పార్టీ శ్రేణులు, దళితులతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కంబాల, చిక్కాల

పాయకరావుపేట: పట్టణంలోని అంబేడ్కర్ పార్కులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం గర్హనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావుతో కలిసి ఇక్కడ ధ్వంసం చేసిన అంబేడ్కర్ విగ్రహం సంఘటన స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం పార్టీ శ్రేణులు, దళితులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. అటువంటి మహానేత విగ్రహాన్ని హోంమంత్రి అనిత ఇలాకాలో ధ్వంసం చేయడం సిగ్గుచేటన్నారు. మరలా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సంఘటన జరిగి మూడు రోజులు అయినప్పటికీ ఆమె ఇంత వరకు సందర్శించకపోవడం ఎంతో విచారకరమన్నారు. ఇప్పటికైనా స్పందించి విగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్‌కు వెళ్లి సీఐ జి.అప్పన్నను కలిశారు. అంబేడ్కర్ విగ్రహం ధ్వంసంపై విచారణ గురించి అడిగి తెలుసుకున్నారు. విచారణ చేస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ సమాధానమిచ్చారు. జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జిల్లా ప్రచార విభాగం మాజీ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బోడపాటి గోవిందు, దోమాడ సుందరరావు, కోనేటి పద్మారావు, కాకాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ జాతర



అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న కంబాల జోగులు



జాతరలో పూజలందుకుంటున్న అభయాంజనేయ స్వామి

ఎస్.రాయవరం: గ్రామాల్లో నిర్వహించే సంబరాలతో సందడి వాతావరణం నెలకొంటోందని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం గోకులపాడు గ్రామంలో అభయాంజనేయ జాతర ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమంలో కంబాల జోగులతోపాటు పార్టీ నాయకులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆనందంగా ఉత్సవం జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, నాయకులు అద్దేపల్లి బొజ్జన్న, నాగంబోయిన శ్రీనివాసరావు, మధువర్మ, అప్పారావు, ఐవీ రత్నం, శేషు, బాలం సుబ్బారావు, పాలుమూరి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పూడిమడక రోడ్డులో దుమ్ముతో అవస్థలు



పూడిమడక రోడ్డులో దుమ్ము లేస్తున్న దృశ్యం

మునగపాక: పూడిమడక రోడ్డులో మునగపాక దరి దుమ్ము లేస్తోంది. దీంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. మునగపాక సమీపంలో గతంలో కుంగిన రోడ్డుకు అధికారులు తాత్కాలికంగా మెటల్ వేసి చేతులు దులుపుకున్నారు. ఈ మార్గంలో వెళ్లే భారీ వాహనాల కారణంగా దుమ్ము ఎగిరి పడుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము ఎగసి కళ్లల్లో పడిపోతుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బోయిలకింతాడలో కిరాణా షాపు దగ్ధం

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడలో బుగత రమణమ్మకు చెందిన పాన్ షాపు గురువారం దగ్ధమైంది. షాపులో ఉన్న సామగ్రి కాలి బూడిదైంది. దీంతో సుమారు రూ.50 వేలు ఆస్తి నష్టం జరిగింది. గత 15 ఏళ్ల నుంచి ఈ షాపు నిర్వహిస్తూ ఆమె జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రమాదంతో బాధిత కుటుంబం జీవనాధారం కోల్పోయింది. షార్టు సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని బాధితులు చెప్పారు.

కనులపండువగా అప్పన్న కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న భక్తులు

సింహాచలం: ఒడిశాలోని చికిడి గ్రామంలో గురువారం ఉదయం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సింహాచలం దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఒడిశాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా చికిడి గ్రామంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రచార రథంలో ఉత్సవమూర్తులకు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఒడిశా భక్తులు కనులారా ఈ వైభవాన్ని వీక్షించారు. గ్రామంలో రథోత్సవం నిర్వహించారు.

దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు చిన్నా, రఘునాథ్, పవన్ తదితరులు ఈ కార్యక్రమం నిర్వహించారు. కాగా ఒడిశాలోని ఈనెల 2 నుంచి ప్రారంభమైన దేవస్థానం ప్రచార రథం పర్యటన గురువారంతో పూర్తయింది. దీంతో సింహాచలం దేవస్థానానికి రథం తిరుగు పయనమైంది.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

- యలమంచిలి డిగ్రీ కళాశాలలో 61.28 శాతం ఉత్తీర్ణత
- అటానమస్ హోదాలో తొలిసారి పరీక్షల నిర్వహణ



సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ రామారావు

యలమంచిలి రూరల్: అటానమస్ హోదా దక్కిన తర్వాత స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత జనవరిలో నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ థియరీ, ప్రయోగ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. కళాశాల ఐక్యూఏసీ హాల్‌లో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ పి. చంద్రశేఖర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ రేఖా రామారావు, అకడమిక్ కో ఆర్డినేటర్ జగ్గారావు ఫలితాలను విడుదల చేశారు. వీటిని విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో చూసుకునేందుకు వీలుగా కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. కళాశాలకు పది సంవత్సరాలు స్వయం ప్రతిపత్తి హోదా లభించిన తర్వాత తొలిసారిగా జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు థియరీ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు మొత్తం 297 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 182 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణతా శాతం 61.28గా ప్రకటించారు. 33 మంది బీఏ ఆనర్స్ కోర్సు విద్యార్థుల్లో 14 మంది (42.42%) ఉత్తీర్ణులయ్యారు. బీకాం ఆనర్స్ విభాగం నుంచి 91 మంది విద్యార్థుల్లో 54 మంది (59.34%), బీఎస్సీ ఆనర్స్ నుంచి 173 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 114 మంది(65.90%) ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులు రీవాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్ కోసం ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. రీవాల్యుయేషన్ ఫీజు ఒక పేపర్‌కు రూ.200గా నిర్ణయించారు. కళాశాల అనతి కాలంలోనే రాష్ట్ర స్థాయిలో పేరొందిందని, ఇందుకు ప్రిన్సిపాల్, అధ్యాపకుల నిర్విరామ కృషి ఉందని, ఫలితాల విడుదల కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కర్రి జానకిరాం, కట్టా బాబ్జి అన్నారు. తమ వంతు సహాయ సహకారాలు కళాశాల అభివృద్ధికి ఎప్పుడూ అందజేస్తామని వారు ఈ సందర్భంగా చెప్పారు. ఫిజికల్ డైరెక్టర్ వై పోలిరెడ్డి, అధ్యాపకులు కిషోర్, పూజ, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

టాపర్లకు అభినందన

మొదటిసారి విడుదలైన పరీక్ష ఫలితాల్లో ఆయా కోర్సులు, గ్రూపుల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్, అతిథులు అభినందించారు. బీఎస్సీ ఆనర్స్ జువాలజీలో జీపీఏ 8.66తో మాచర్ల సూర్య దుర్గా వరలక్ష్మి, బీఎస్సీ ఆనర్స్ బోటనీలో 8.40 జీపీఏతో కలగా స్నేహ ప్రేమ వెంకటలక్ష్మి, కంప్యూటర్ సైన్స్‌లో గొర్లి పుణ్యవతి 8.31 జీపీఏతో, బీఎస్సీ కెమిస్ట్రీలో 7.99 జీపీఏతో అర్జిల్లి భాను టాపర్లుగా నిలిచారు. టాపర్లకు కొందరు అధ్యాపకులు నగదు బహుమతులు అందజేశారు. వచ్చే రెండో సెమిస్టర్ ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన టాపర్లకు పూర్వ విద్యార్థుల సంఘం తరపున నగదు బహుమతులు అందజేయనున్నట్టు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. కళాశాల పురోభివృద్ధిలో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం కృషిని వారు ఈ సందర్భంగా ప్రశంసించారు.

రెండో రోజు కొనసాగిన నిరసన



నిరసన చేపట్టిన సర్పంచ్‌లతో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

మాకవరపాలెం: ప్రమాదాలతో పాటు రోడ్లు అధ్వానంగా మారుతున్నాయంటూ బాక్సైట్ లారీలను అడ్డగించి చేపట్టిన నిరసన కొనసాగుతోంది. మండలంలోని శెట్టిపాలెం, భీమబోయినపాలెం, జడ్.గంగవరం సర్పంచ్‌లు అల్లు నామునాయుడు, రుత్తల నందకిషోర్, దుంగల రమణ ఆధ్వర్యంలో బుధవారం బాక్సైట్ లోడ్ లారీలను అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా భీమబోయినపాలెం వద్ద వారంతా గురువారం తమ నిరసన కొనసాగించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సర్పంచ్‌లతో చర్చలు జరిపారు. ఖనిజంతో ఉన్న లారీలను రిఫైనరీకి వెళ్లనిచ్చేదిలేదని, కావాలంటే వెనక్కి తీసుకుపోవాలని వారికి స్పష్టం చేశారు. ఖాళీ లారీలను విడిచిపెట్టడంతో అసోసియేషన్ ప్రతినిధులు వెనుదిగారు.

బైక్ ఢీకొని ఆలయ అర్చకుడికి తీవ్ర గాయాలు

మాడుగుల రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొని ఎం.కోడూరు శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ ప్రధానార్చకుడు పెద్దింటి రాంబాబుకు గురువారం తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాడుగులలో రాంబాబు నడిచి వెళ్తుండగా ఓ యువకుడు వెనక నుంచి బైక్‌కు బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాంబాబును స్థానికులు ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుడు సంతోష్‌కుమార్ ప్రథమ చికిత్స చేశారు. రాంబాబు తల వెనక భాగంలో మూడు కుట్లు, కాలికి నాలుగు కుట్లు వేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు బైక్‌ను స్వాధీనం చేసుకుని, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్చరీలో ప్రతిభ చాటిన గణేష్‌కు అభినందన



కాంస్య పతకం సాధించిన గణేష్ మణిరత్నం

పరవాడ: ఉత్తరాఖండ్‌లో ఇటీవల జరిగిన 38వ జాతీయ క్రీడల్లో అద్భుతవిజయం సాధించిన విశాఖ జిల్లా ఆర్చర్ తిరుమూరు గణేష్ మణిరత్నంను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మణిరత్నం కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత ఆర్చరీ ఈవెంట్‌లో కాంస్య పతకం, కానో స్లాలోమ్ ఉమెన్స్ (కె-1) మిక్స్‌డ్ కాంపౌండ్ ఈవెంట్‌లో రజత పతకం కైవశం చేసుకున్న సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి నిశాంత్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి భాస్కర్, పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, వైజాగ్ ప్రొఫైల్స్ అధినేత వి.కృష్ణారావు, వి.కృష్ణమూర్తి తదితరులు అభినందించారు.